

## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపంరంజిల్లాలి!
ముజ్జగాలు సాయిమహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీథిలో ప్రతిధ్వనించాలి! ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు సర్వత్రా వ్యాపించాలి! ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటిదైవంబు లేడోయి లేడోయి!'అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాధుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో ప్రార్థించటమే మనం చేయగలిగింది, చేయవలసింది.

-- శ్రీ బాబూజీ

## ఈ సంచికలో


| | | |
|---|---|---|
| 1. సాయివంటి దైవంబు లేడోయి! లేడోయి!! | శ్రీ బాబూజీ | --- 2 |
| 2. ఉన్నమాట - అనుకున్న మాట | గురుబంధువులు | --- 3 |
| 3. ఆదుకున్నా ఆవేదన తీర్చినా - గురూజీయే | పరిమళ | --- 5 |
| 4. అవసరానికి ఆసరా - గురుకృపే | దశరధరామిరెడ్డి | --- 6 |
| 5. గురుమహిమ | సాయిప్రసాద్ | --- 7 |
| 6. గురుస్థానం - గురుహృదయంలోస్థానం | ఉమామహేశ్వరరావు | --- 10 |
| 7. చేతన్ అన్నపేరు-వారి చైతన్య స్వరూపానికి మారుపేరు | డా॥ ఉమ | --- 15 |
| 8. సాధన ఒకింత - ఫలితం పసిడంత | వల్లీ | --- 16 |
| 9. ఆశ్రిత రక్షణే కాదు, అనుబంధీకులది కూడా | శాఖమూరి వెంకటనారాయణ | --- 17 |
| 10. ఆపదలో, ఆలోచనతో గురుకృప | డి.జి.యస్. కుమార్ | --- 18 |
| 11. ఆచేయి ఎంత హాయి | డా॥ ఎస్. సాయివరప్రసాదరావు | --- 19 |
| 12. మహనీయుల మహితోక్తులు | గురుచరణదాసుడు | --- 22 |





శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై!

సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీకీ జై!

# గురుకృప

సంపుటి 6 | సంచిక 3 | త్రైమాసిక పత్రిక | జూలై 2003

**నిర్వహణ**
గురూజీ
ఆశీస్సులతో
గురుబంధువులు

**చిరునామా**
గురుకృప
22-1-50
గాంధీచౌక్
తెనాలి - 01

08644
227194 (O)
231808 (R)

## ఉన్నమాట - అనుకున్నమాట

వినటానికి ఎన్నో విషయాలను వింటూ వుంటాము. గుంపులు గుంపులుగా, తండోప తండాలుగా, నానా తంటాలు పడి వచ్చి ఎందరెందరో వింటూనే వుంటారు. మరికొందరు సుదూర ప్రాంతాలనుంచి వచ్చి వింటూనే వుంటారు. లెక్కించి చెప్పితే వేలల్లోనే వుంటారు. ఇసకేస్తే రాలనంతటి జనసందోహం వచ్చిన రోజులున్నాయి. చాలామంది దేవాలయాల్లో ప్రతినిత్యం జరుగుతున్న ఆధ్యాత్మిక బోధనలు వినేందుకు తహతహలాడుతుంటారు. దూరదర్శన్‌లో ఎందరో మహాత్ములు చెప్పే ప్రసంగాలు వింటూనే వుంటారు. ఇవికాక దివ్యబోధనలు, ప్రవచనాలు, సూక్తిసుధలు, సువార్తలు, ఆదర్శవ్యక్తుల జీవితచరిత్రలు, ఇలా ఎన్నో, ఎన్నింటినో కేజీలకొద్ది పేజీలను తిరగేస్తుంటారు. చూచేందుకిదంతా ఆధ్యాత్మిక జీవనవాహిని మోసులెత్తి ప్రవహించే భారీ నదీనదాలుగా ఉధృతంగా ప్రవహిస్తున్నదా? అనే భావన రాక మానదు. అంతర్దృష్టితోనో, సద్గురు సేవలో తృప్తి చెందినవారు, గుర్వనుగ్రహపాత్రులు చూడగల్గినప్పుడు ఇది వాపేగాని బలుపు కాదనిపిస్తుంది. ఇరుకైన పిల్లకాలువలా కన్పిస్తుంది. నేతిబీరలో నెయ్యి ఎంత ఉంటుందో అంతే మరి ఇది కూడా అన్పిస్తుంది.

వినటము వేరు. ఆచరణ వేరు. విని ఆచరించి అనుభవంలోకి తెచ్చుకోవడం వేరు. ఇవి ఒక దానికొకటి ఉపస్కారకాలు, అవిభాజ్యాలు. పుట్టుక వలన బాల్యము, యౌవ్వనము, ముసలితనము వచ్చినట్లుగా అవి అంతే. ఇప్పటి కెన్నో మారులు మనమంతా మన మన సత్సంగాలలో **"గురు మహిమ - గురు మహిమ"** అనే భజనగీతాన్ని ఆలపించాము. భజనగీతంలో **"కిం వచనీయం గురుమహిమ - కిమ వచనీయం గురుమహిమ"** అని





పాడుకుంటాము. కాని భావాన్ని మాత్రం హృదయస్తం చేసుకోవడమన్నది మరచిపోతాము. రామచిలుక రామ నామాన్ని పల్కిన విధంగానే మనం కూడా! కొందరు హృదయగతం చేసి ఉండవచ్చు. దాన్ని ఆచరణ నుంచి అనుభవం దాకా తెచ్చుకోలేకపోతున్నాం. భావాన్ని విశాలం చేసి హృదయతంత్రులకు తరలింపచేయగల్గితే హృదయకవాటాలు తెరుచుకొని అనుభవానికి స్వాగతాలు పల్కుతాయి, పులకితగాత్రులను చేస్తాయి. గురుగమనానికి, గురువచనానికి వేచి, వేచి ఉండి ఎదురుచూస్తూ తపించే వారికి భావం బలపడుతుందేమో కాస్త యోచించండి. కొన్ని నిముషాలైన మనోగత భావాన్ని దానిపై కేంద్రీకరించండి. సమాధానమందుతుందేమో చూడగలం. యాంత్రికజీవన చర్వితులకు కర్మాచరణమో, కర్తవ్యాచరణమో చేస్తున్నామనే బాహ్యతృప్తికి లోనైపోతున్నారు. అది అంతరేంద్రియాలను తాకటంలేదు. అంతఃశుద్ధి చేయటం లేదు. ఉదాహరణకు ధనాపేక్షాపరులైన బ్రాహ్మణులు కొందరు తమ వేదవిద్యను బాబా ముందుంచినచో బాబా వారికి అధికమైన ధనాన్నిస్తారని ఆశించి వెళ్లారు. తీరా బాబాను దర్శించిన తరువాత అభిజాత్యాలు అడ్డుతగిలాయి. ధనాపేక్ష తమలోని నీతిసూత్రాన్ని దూరం చేసింది. ప్రత్యామ్నాయ మార్గాన్ని అన్వేషించి పిడికెళ్లు విష్ణుపాదాలుగా భావించి, తాము వేదాన్ని విష్ణువుకు వినిపిస్తున్నామని భావించి, అభిజాత్యమతాభిమానాన్ని కాపాడుకొని నామనుకున్నారు. సంకుచితమైన భావోత్పత్తికి తాము ఉదాహృతులైతారని గమనించలేకపోయారు. మతాభిమానాన్ని కాపాడుకొన్నామని భావించిన వారితో బాబా "మీరు ఎవరినైతే దైవంగా భావించారో వారే మీకు "ధనాన్నిస్తా"రని అన్నారు. కాని వారికి ధనమిచ్చింది మాత్రం బాబానే. అందుకనే మనం చేసే పని యాంత్రికంగా ఉండరాదు. దానివలన ఫలితం శూన్యం.

సరియైన భావనలేనిదే ఆధ్యాత్మికత వికసించదు. కేవలం వల్లె వేసినంత మాత్రాన ఆశించినంత ప్రయోజనం అంతగా ఉండదనే చెప్పాలి. మన గురుదేవులుకూడా **"భావమే"** ప్రాణమని విశదీకరించారు. అన్నమయ్య వంటి పరమ భాగవతోత్తములు **"భావములోన - భాగ్యమునందున"** అని అనటం ముదావహం. అదే మాదిరిగా గురువచనం అమోఘమనే భావం హృదయస్తం కావాలి, ఆచరించాలి.

హృదయంగమైన వానిచర్య ఎలా ఉంటుందో బాబా చరిత్రలో చూద్దాం. ఒకరోజున బాబా మేకను నరికే విషయంలో షామాను, బడేబాబాను ఆ పనిని చేయమనినారు. కానివారు చాలా తెలివిగా తప్పకొనినారు. దీక్షిత్‌కు ఈ విషయాన్ని చెప్పిన మరుక్షణమే మేకను నరికేందుకు ఉద్యుక్తుడైనాడు. అతని తీవ్రతను గమనించిన బాబా ఆపివేసినారు. మొదటి ఇద్దరిలో పాప పుణ్యాల భావనలు మొలకెత్తినవి. దీక్షితునిలో **"గురువచనమే"** తప్ప అన్య ఆలోచనలకు తావీయలేదు. గురువు చెప్పిన పనిని చేయటమన్నదే ముఖ్యం. తత్ఫలితంగా గుర్వనుగ్రహమనేదే నిజమైన గురుపూర్ణిమలా భాసిస్తుంది. **"సాయినోట యధాలాపంగానైనా పలికిన ప్రతి పలుకు ఒక శృతివాక్యము" - గురుదేవులకు. నేనేది బోధించను, నేర్చుకోనేట్లు చేస్తాను అన్న గురూజీ, వారి ఆచరణలో సాయిమార్గాన్ని చూస్తున్న మనం... గురువచనం పట్ల మన ఆచరణను సమీకృతం చేసుకోవడమే నిజమయిన గురుపూర్ణిమ.**





# ఆదుకున్నా - ఆవేదన తీర్చినా గురూజీయే!

"నా భక్తులు కోరినవన్నీ ఇస్తాను, నేనివ్వదలచింది వారడిగేంతవరకు" అన్న బాబా వాక్కును, మన గురుదేవుల (బాబూజీ) చెంతకు చేరాక గాని సరిగా అర్థం చేసుకోలేమేమో! ఎందుకంటే బాబా మనకు శ్రేయస్కరమైనదే ఇస్తారన్న అవగాహన కలిగిందంటే దానికి కారణం గురుదేవుల అనుగ్రహమే! నానాసాహెబ్‌చందోర్కర్ మనుమరాలు, అల్లుడులను వరుసగా కోల్పోవడంతో, చందోర్కర్ కుటుంబం బాబాపై అలిగి దూరంగా ఉంటుంది. "మీరు ఇలాంటి కోర్కెలతో నా వద్దకు వచ్చేట్లయితే నా వద్దకు రావల్సిన అవసరం లేదు" అని బాబా చెప్పటం, అనతి కాలంలో బాబా యొక్క కరుణను అవగతం చేసుకున్న నానా కుటుంబం తిరిగి బాబా పట్ల శ్రద్ధ కలిగి ఆనందంగా ఉండటం మనకు తెలిసిన విషయం.

పరిమళ విషయంలో చిన్నతనంలోనే అందరినీ కోల్పోయినా, బాబా గురుదేవులు కేవలం వారి కృపతో ఈనాడు తనను కాపాడుతున్నారు. తండ్రికి బిడ్డ ప్రయోజకుడై తన స్వశక్తిపై స్వతంత్రుడుగా నిలబడి అవసరమైనవి సమకూర్చుకోవాలని ఉంటుంది. ప్రాకృతికమైన దేహాన్ని ప్రసాదించిన తండ్రే అంత కరుణ కలిగి ఉంటే, మరి తల్లి, తండ్రి, దైవం తానైన సద్గురువో! .......**గురుకృప.**

పూజ్య గురుదేవుల అనుగ్రహంతో నేను నా జీవితంలో ఒక కీలకమైన అనుభవాన్ని వ్రాయగలుగుతున్నాను. గురు అనుగ్రహమే లేకుంటే నేను నా జీవితంలో ఏదీ సాధించలేక పోయేదాన్ని.

నేను నా బాల్యంలోనే నా తల్లిదండ్రుల్ని పోగొట్టుకున్నాను. నాకు కేవలం ఒక్క అక్క మాత్రం ఉంది. తను, తన భర్త, పిల్లలతో సుఖంగా ఉంది. మా నాన్నగారు పరమపదించాక ఏడుసంవత్సరాలు హైదరాబాద్‌లో ఉండి, నేను నా చదువు ముగించి ఒక ఫార్మస్యూటికల్ కంపెనీలో పనిచేసాను. మా అక్కవాళ్ళది ప్రేమ వివాహం, బావగారి బంధువులకు నేనక్కడ ఉండటం గిట్టక, ఎప్పుడూ ఏదో ఒక ఇబ్బంది వచ్చేది. మా అక్క వాళ్ళింటికి దగ్గరలో ఒక బాబా మందిరం ఉండటంతో నాకష్టసుఖాలను బాబాకు చెప్పుకుంటూ హారతి, భజనకు వెలుతుండేదాన్ని. ఇలా బాబా మందిరానికి వెళ్ళడం నాకు బాగా ఉపయోగపడింది. మా అక్క నన్ను చెన్నైలో ఉన్న మా అంకుల్ వాళ్ళింటికి వెళ్ళమని చెప్పడంతో నేను మా అంకుల్‌ని సంప్రదించాను. ఆయన నుంచి సరైన ప్రతిస్పందన రాకపోవడంతో నేను ఎక్కడికి వెళ్ళాలో తెలియక సందిగ్ధంలో పడ్డాను. ఆరు నెలలు గడిచాక అంకుల్ కూడా మరణించారు. ఎక్కడ ఉండాలో తెలియని నేను, చివరికి బాబా అనుగ్రహంతో 26-4-00 న చెన్నై నగరంలో అడుగుపెట్టాను. దాదాపు 5 నెలలు బంధువుల ఇళ్ళలో గడిపాక చివరికి నేను మా పిన్నిగారింట్లో ఆశ్రయంపొందాను. ఆమె హృద్రోగి కావడంతో ఆమె ఇంటిపనులు కూడా చేసుకోలేకుండా ఉంది. ఆమె నన్ను తనతో పాటే ఉండమని, ఆమె నా వివాహానికి ఏర్పాటు చేస్తానని సలహా ఇచ్చింది. అలా ఒకటిన్నర సంవత్సరం గడిచిపోయింది. కానీ, నా వివాహ



ప్రయత్నమేమీ జరగలేదు. మా బాబాయ్ నాకు ఉద్యోగం వెతకమని వాళ్ళ స్నేహితుడితో చెప్పారు. గురుదేవుల అనుగ్రహంతో ఇంతలో నాకు వాళ్ళ ఇంటిదగ్గరలోనే ఒక చిన్న ఉద్యోగం దొరికింది. నేను అక్కడ ఉండటం పిన్ని వాళ్ళ బంధువులకు ఇష్టంగా ఉండేది కాదు, కష్టంగా తోచేది. నేను ప్రతిరోజు బాబా సహాయం కోసం అర్థిస్తూ ఉండేదాన్ని. ఇలా ఉండగా రోజురోజుకు మా పిన్ని ఆరోగ్యం క్షీణించి, డాక్టర్లు కూడా ఏమీ చేయలేక, ఆమె అక్టోబర్ 20, 2001న మరణించారు. పిన్ని వాళ్ళ బంధువులంతా నన్ను మా పిన్ని మరణానికి కారణమన్నారు. నిజానికి ఆ సమయంలో నాకున్న ఒక్క ఆసరా కోల్పోవడంతో నా బాధ వర్ణనాతీతం, గురుదేవుల సహాయం కోసం వేడుకున్నాను. మా బంధువులంతా నేను చెన్నైలో ఉండటాన్ని వ్యతిరేకించారు. ఆ క్షణానికి గురుదేవుల రూపంలో మా అంకుల్ స్నేహితుడు నాకు ఒక ఉద్యోగమిప్పించారు. ఆయన సహాయంతో నేను ఒక లేడీస్ హాస్టల్‌లో ఒక ఆరునెలలు ఉన్నాను. ఆ సమయంలో అందరూ నాకు ధైర్యం చెప్పారు. గురుదేవుల అనుగ్రహంతో తక్కువ వ్యవధిలోనే నేను, నా స్నేహితులు కలిసి బయట ఇల్లు అద్దెకు తీసుకున్నాము. ఇలా మా పిన్ని వాళ్ళింట్లోంచి బయటకు వచ్చి నాకు స్థిరపడే అవకాశమిచ్చి నన్ను ఆదుకున్నారు గురువుగారు.

-పరిమళ, చెన్నై

**జీవిత గమనంలో జరిగే ప్రతి సంఘటన మనల్ని 'సద్గురువు' చెంతకు చేరుస్తుంది.**

## అవసరానికి ఆసరా - గురుకృపే

నా పేరు సి.హెచ్. దశరథరామిరెడ్డి. నా కూతురు, అల్లుడు కాలిఫోర్నియాలో వుంటున్నారు. ఆగష్టు 2002 నందు ఒకరోజు సాయంకాలం మా అమ్మాయి ఫోనుచేసి, డాడి మీ అల్లుడుగారికి ప్రాజెక్టుపని అయిపోవచ్చినది. ఎఫ్.బి.ఐ. వాళ్ళు గ్రీన్‌కార్డు ప్రాసెస్ లేటు చేస్తున్నారు., ఏమి చెయ్యాలో అర్థం కావటం లేదు అని చెప్పినది. దానికి అంతబాధ దేనికమ్మా, గురువుగారికి ఇ-మెయిల్ చేయండి అన్నీ ఆయనే చూసుకుంటారు అని, ఇ-మెయిల్ అడ్రసు చెప్పాను. గురువుగారు ఇ-మెయిల్ అవసరము లేకుండానే మూడవరోజుకే గ్రీన్‌కార్డు ప్రాసెస్ పూర్తి చేసివాళ్ళకు గ్రీన్‌కార్డు ఇప్పించి ఆదుకున్నారు. ఇలా ప్రతి అవసరానికి ఆదుకుంటూ మమ్ములను కాపాడుతున్న - గురువుగారికి సర్వదా కృతజ్ఞుడను.

- దశరథరామిరెడ్డి, నెల్లూరు

**I take care of my people generation after generation birth after birth. - Baba**

తలపులతో తలచినంతమాత్రాన... పిలుపులతో పిలిచినంతమాత్రాన...
తలుపుతట్టి తలపులను తరింపచేయు... పరవశించు ప్రేమతో పల్కరించి వరము లిచ్చు దైవము...
సాయిసాధనా స్వరూపి శ్రీశరద్బాబూజీ ..... భక్తిభరిణె నుండి





# గురు మహిమ

నెల్లూరు జిల్లా వెంకటగిరిలో మునికోటయ్య బట్టలు నేసుకునే కుర్రవాడు. అతనికి 16 ఏండ్ల వయస్సులో వెన్నుపూసలో ఏదో అయి అతని కాళ్ళు క్రమంగా చచ్చుబడి పోయాయి. కాళ్ళను గుద్దినా, సూదితో గుచ్చినా అతనికి స్పర్శ తెలిసేది కాదు. అతని తల్లిదండ్రులు వారి శక్తి కొలది వైద్యము చేయించారు. ఫలితము లేకపోయింది. విధిలేక అతని తల్లితండ్రులు ఒక చిన్నగది కట్టించి అందులో ఒక మంచము వేసి అతనిని ఉంచారు. అతడు అవసరాలను ఇతరుల సహాయముతో తీర్చుకొనేవాడు. అలా అతడు జీవితంలోని ఆనందాన్ని కోల్పోయి నిస్త్రాణంగా బ్రతకసాగాడు. ఇలా ఐదారు సంవత్సరాలు గడచి పోయాయి. అలా అతను నిస్సారమైన బ్రతుకు బ్రతుకుతూ ఉండగా, 2002లో వారి పొరు గింటిలో సాయిబాబా సత్సంగము మొదలయింది. సత్సంగంలో బాబా-బాబూజీల చిత్రపటాలకు అతను మొర పెట్టుకొనే వాడు తనకు స్వస్థతనీయమని. ఆ సత్సంగానికి వచ్చే వారికి ఎందరికో బాబా - బాబూజీల అనుగ్రహంతో వారి వారి బాధలు తొలగి వారి వారి జీవితాలలో సుఖశాంతులు నిండు తున్నాయి. మునికోటయ్యఅన్న నియమంగా సత్సంగానికి వెళ్ళేవాడు. అందరికి అందుతున్న గురు అనుగ్రహాన్ని గమనించేవాడు. తన తమ్ముని అవిటితనాన్ని తీర్చమని ఒకనాడు ఆవేదనాభరిత హృదయంతో ఆర్తితో గురుదేవులు శ్రీ సాయినాథుని శరత్ బాబూజీకి ఉత్తరం వ్రాసి, సత్సంగంలో ఉంచాడు. ఉత్తరం వ్రాసుకొన్న తొమ్మిదవనాడు మునికోటయ్య తన స్నేహితులను పిలచి తనకు నడవాలనిపిస్తున్నదని కాస్త చేయి పట్టమని అడిగాడు. ఆశ్చర్యపోయిన అతని స్నేహితులు అతన్ని పైకి లేపి పట్టుకొన్నారు. మునికోటయ్య 5-6 అడుగులు వేసి కాళ్ళు నొప్పిపుడుతున్నాయని కూర్చున్నాడు. దాదాపు ఐదుసంవత్సరాలుగా కాళ్ళు ఉన్నట్లుగా కూడా స్పర్శ తెలియని వాడికి ఒక్కసారిగా నడవాలని పించడం - నడవడమూ - కాళ్ళు నొప్పిగా ఉన్నాయనడమూ - అక్కడ చేరిన వారందరికీ అత్యంత సంభ్రమమూ, ఆశ్చర్యమూ కలిగించాయి. ఆ తరువాత గురుకటాక్షంతో కొద్దిరోజుల్లోనే పూర్తిగ నడవ గలిగాడు. వెంకటగిరిలో మునికోటయ్య అనారోగ్యం నుండి కోలుకొని నడవగలుగుతున్నాడన్న వార్త విన్నవారందరూ అతన్ని చూడబోయారు. అతను గురువు అనుగ్రహముతో స్వస్థత పొందిన వైనం చూసి అచ్చెరువంది - బాబా సత్యము - బాబా అనుగ్రహము సత్యము - గురువు సత్యము - గురువనుగ్రహము - సత్యము అన్న నిజాన్ని కండ్లారా చూచి, ఆస్తికులుగా మారి గురువనుగ్రహాన్ని పొందాలని కృతనిశ్చయులయ్యారు. అలా ఎండి మోడువారి పోయిన మునికోటయ్య జీవితాన్ని చిగురింపజేసి క్రొత్త వసంతాలను నింపిన గురుదేవులను ఏమని స్తుతించగలము! ఆ గురు మహిమను వర్ణించడానికి ఆ ఆదిశేషుని వేయి నాలుకలకు కూడా సాధ్యము కాని విషయమే.

'ఫంగుం లంఘ యితి గిరిం' కుంటివాడు కొండనైనా గురువనుగ్రహంతో ఎగిరి దాట గలుగుతాడని ఎక్కడో ఉన్న శాస్త్ర వాక్యం నిజమని నిరూపించబడటం కండ్లారా చూడగలిగిన మన భాగ్యమేమని చెప్పగలం! అటువంటి మహామహిమాన్వితుడైన సద్గురువు శ్రీ సాయినాథుని శరత్ బాబూజీ! అటువంటి గురువును ఆశ్రయించిన వానికి చింత, కలత కూడా ఉండదు కదా! చింతలేని జీవితమే కదా పరమానందభరితమైనది. జీవితాన్ని పరమానందభరితం చేసేది ఆ సద్గురునాథుడే! ఆయన మహిమ అమృత వర్షిణి. ఇలా దిక్కులేక దీనులై కుమిలి పోతున్న ఎన్ని వ్యధా భరిత హృదయాలకు





ఆయన బాసటై నిలిచారో, ఎందరి కండ్లనీరు తుడిచి ఆనందాన్ని నింపినారో! అదే గురుమహిమ. ఆ గురుమహిమను అనుభవించగలగడం కంటే నిజమైన ధన్యత మరొకటి లేదు.

నేను మునుపు బాగా సిగరెట్లు త్రాగేవాడిని. రోజుకు కనీసం రెండు పెట్టెలన్నా కాల్చేవాడిని. గురువుగారు ఆ అలవాటు మానుకోమని చాలా సార్లు చెప్పారు. కానీ నా వల్ల కాలేదు. సరికదా ఇంకా ఆ అలవాటు పెరిగి రోజుకు మూడు పెట్టెలదాకా వచ్చింది. గురువుగారు సిగరెట్లు మానమని చెప్పడం మానుకొన్నారు. 1995లో మే 5వ తారీఖున సాయంత్రం నాకు గుండెలో ఎక్కడో ఇబ్బందిగా అనిపించడం మొదలయ్యింది. ఆయాసం మొదలయింది. నాకు భయమేసింది. అప్పడే నాకు గుండెపోటు రావడమేమిటి? ఆ తరువాత బ్రతుకేమిటి? అని వెంటనే నేను డాక్టరు దగ్గరకు పోయినాను. ఆయన అన్ని పరీక్షలు చేసి ఏమి లేదన్నారు. వెంకటగిరి నుండి గురుబంధువు ఒకరు షిరిడీకి ఫోను చేసి నా విషయం గురువుగారికి చెప్పించారు. వెంటనే నాకు గురువుగారి నుండి వచ్చిన సందేశం 'సిగరెట్లు మానమను.' ఆరోజు గురువుగారి మాటలోని మహత్తు నాలో పని జేసిందో, లేక భయమేసిందో, గురువుగారి మహత్తువల్ల అప్పటి నుండి సిగరెట్లు తాగాలన్న కోరిక నాలో చచ్చిపోయింది. నేను మునుపు పొగ త్రాగే వాడినన్న విషయం గుర్తులేనంతగా ఆ కోరిక ఎండి పోయింది. అలా నన్ను "కొరత" వేసినంత పనిచేసి ఆ దురలవాటు నుండి మరల్చారు గురువుగారు. నాలాగే ఎన్నో దురలవాట్లకు లోనై ఎందరినో తమ ఆశీస్సుల వలన ఆ దురలవాట్ల నుండి మరల్చి వారి హృదయంలో శాంతిని నెలకొల్పారు. మనకై మనము మానుకోవాలన్నా మానుకోలేని మన దురలవాట్లనుండి మనలను రక్షించి తరింప జేస్తుంది గురు అనుగ్రహం.

అలా బాబా అనుగ్రహాన్ని అనుభవిస్తూ పోతున్న వ్యక్తి హృదయం క్రమంగా పరివర్తన చెందుతుంది. నాకు బాగా తెలిసిన ఒక కుర్రవాడు కొంచెం కఠినంగా ఉండేవాడు. తన సుఖం చూచుకొనేవాడేగానీ ప్రక్క వాళ్లను అసలు పట్టించుకొనేవాడు కాదు. అతని కేదో కష్టమొస్తే బాబా-బాబూజీలకు నమస్కారం చేసుకొని ఉత్తరం వ్రాసుకొన్న తరువాత ఆ కష్టం తీరింది. క్రమంగా సత్సంగానికి రాసాగినాడు. ఒకనాడు అతను ప్రయాణం చేస్తున్న బస్సులో నేను కూడా ఉన్నాను. ఒక ముసలివాడు కాలుకు కట్టుకట్టుకొని కుంటుతూ బస్సు ఎక్కినాడు. ఎవ్వరూ అతనికి కూచోడానికి స్థలం ఇవ్వడంలేదు. నేను వెనుక వైపు కూర్చొని ఉన్నాను. ఆ కుర్రవాడు ముందు ఉన్నాడు. ఆ ముసలివాడు ఆ కుర్రవానివద్దకు రాగానే అతడు లేచి ముసలతన్ని కూర్చోమని స్థలమిచ్చి లేచి నిలుచున్నాడు. అతని స్థాయికి అది పెద్ద పరివర్తన. సద్గురు అనుగ్రహంవల్ల సాటిజీవి పట్ల కాస్తంత ప్రేమ అతని హృదయంలో మొలకెత్తింది. తాను నిలుచొని కష్టపడుతున్నా అతని ముఖంలో ఒక తృప్తి, ఆనందము తొంగి చూడసాగాయి. ప్రేమలోని ఆనందం రవ్వంత అతను అనుభవించగలిగాడు. అంటే కాస్తంత ప్రేమ అతని హృదయంలో "రగులు" కుంది.

ఆర్థికంగా బాగా చితికి పోయి అప్పలలో కూరుకు పోయిన ఒక భార్య - భర్తలు గురువుగారి మహిమగురించి విని వారిని ఆశ్రయించారు. క్రమంగా వారి ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయి కాస్త స్థిర పడ్డారు. ఆ భార్యా భర్తలలో, భర్తకు భార్యంటే అభిమానమున్నా ఆమెను నలుగురిలోనూ అవమానించేవాడు, ఆదరంగా చూచేవాడు కాదు. పిల్లలనూ అంతే. అతనంటే చచ్చేంత భయము పిల్లలకు. గురువుగారిని ఆశ్రయించి వారి ఆర్థిక ఇబ్బందులు తొలగి పోయే లోపల అతనిలో భార్యపట్ల, పిల్లలపట్ల చాలా ప్రేమ పెరిగింది. ఒకరినొకరు ఆదరించుకొంటున్నారు. తండ్రి ఇంటికి వస్తే ఏమి





గొడవ జరుగుతుందోనని భయపడి - ఇల్లు నరకంగా భావించిన పిల్లలు ఇపుడు తండ్రి కొరకు ఎదురుచూస్తుంటారు. ఆ ఇల్లు వారికిపుడు స్వర్గసీమగా మారిపోయింది. ఎప్పుడూ **'బాబా భజన, బాబూజీకి** చెందిన విషయాల సత్సంగము'. అలా ఆ **ఇల్లే ఒక దేవాలయంగా మారిపోయింది.** ప్రేమ నిండిన ఆ ఇల్లు, ఆ ఇంట్లోనివారికేగాక ప్రక్కవారికి కూడా ఆనందాన్ని పంచుతున్నది. చితికి పోయి నరకంగా మారిన ఇంటిని నిలబెట్టి స్వర్గంగా మార్చి ఆ యింటినే తనమందిరంగా మార్చుకొని ఆ ఇంటిలోని వారినందరినీ ఆనంద సాగరంలో ఓలలాడిస్తున్నది గురుఅనుగ్రహము.

ఇలా పిసినారిగా ఉన్న మనసులో దానగుణాన్ని నింపేది, భయంతో కుమిలి పోయిన మనసులో ధైర్యం నింపేది, ఈర్ష్యా, ద్వేషము మొదలైన అరిషడ్వర్గాలకు అలవాలమైన మనసులో కరుణ - ముదిత - మోదము - మైత్రి మొదలయిన దైవీ గుణాలను పెంపొందించేది, సాధారణమైన మనిషిని దివ్యమైన ప్రేమ మూర్తిగామార్చేది-గురుఅనుగ్రహమే. అలా సంకుచితమైన మనసు వికసిస్తూ పోతున్నది కేవలం గురువనుగ్రహము వలననే.

ఇలా ప్రేమలేని హృదయంలో రవ్వంత ప్రేమ నింపి తమవద్దకు లాక్కొంటారు ఆ పరమ ప్రేమ స్వరూపుడైన సద్గురుమూర్తి శ్రీ సాయినాథుని శరత్ బాబూజీ. **ఆ సర్వోత్కృష్ఠమైన, పరమ పావనమైన సన్నిధిలో ఎటువంటి పతితుడైనా పావనుడుగా మారి తీరవలసిందే!** అటువంటి సర్వోత్కృష్ఠమైన సన్నిధిలో ఒక భక్తుడు దేహము గగుర్పాటు చెంది తన్మయత్వాన్ని అనుభవిస్తున్నాడు. మరొక భక్తునికి గురుదేవులు తనను ఆయనలోనికి లాక్కొని 'తనను' లేకుండా చేస్తున్న తన్మయత్వపు మత్తు. మరొక భక్తునికి ప్రపంచమే తెలియదు, కాలమే ఆగిపోయిన పారవశ్యత. మరొక భక్తునికి గురుదేవులు ఒక కాంతి పుంజమై, తానుకూడా ఆ కాంతి పుంజములోని ఒక కిరణమైన అనుభూతి. ఒక భక్తురాలికి తాను సత్సంగమందిరములో ధ్యానంలో ఉన్నప్పుడు తనే గురుదేవుల వద్దకు వెళ్ళి ఆశీస్సులు అందుకున్నట్లు దివ్య దర్శనము. ఆ కృపాకటాక్ష వీక్షణము తమపై పడిన వెంటనే తమ హృదయంలోని ఆవేదనలన్నీ తొలగిపోయి తేలికపడి - ఆనంద సుధాబ్ధిలో ఓలలాడిన హృదయాలు అనేకము. ఇలా ఆ సన్నిధిలో అలౌకికానందానుభూతులను పొందిన నిర్మలహృదయాలు అనేకం. అలా నిర్మల హృదయులైన భక్తులు గురుదేవుని ఆరాధనా ప్రేమ పారవశ్యతలో కరిగిపోయి తామేలేని తన్మయత్వపు తావైన గురురూపంలో ఐక్యమైయ్యేందుకు పరితపించిపోతారు. ఆ సద్గురునాధుడు అలా పరితపించే హృదయాలను తమలో ఇముడ్చుకొని ఆనందిస్తారు.

గురుమహిమ పైన కనిపిస్తున్న పరిణామక్రమంలో, వ్యక్తి కష్టం తీర్చి ఆపై దుర్గుణాలను నిర్మూలించి-ఆపై మానసిక వికాసాన్ని ప్రసాదించి - ఆపై అలౌకికానందానుభూతులను నింపి - ఆపై సద్గురువు పట్ల ప్రేమను పెంచి - గొంగళిపురుగువంటి సంకుచితమనస్కుడైన వ్యక్తిని సీతాకోక చిలుకవంటి ప్రేమమయుడైన మహిమాన్వితునిగా మారుస్తుందన్నది విశదము.

గురుపూర్ణిమ నాడు సద్గురువులు తమ తపోశక్తిని తమను ఆశ్రయించినవారికి ప్రసాదిస్తారని సద్గురు శ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ నొక్కి వక్కాణిస్తారు. సాయిబాబా గురుపూర్ణిమ నాడు విధిగా పూజ చేసుకొమ్మని ఆదేశించినారు. కనుక అటువంటి గురుపూర్ణిమ నాడు సద్గురు సన్నిధిచేరి వారి అనుగ్రహామృతాన్ని ఆస్వాదించి ధన్యులమవుదాము.

సాయిప్రసాద్, కందుకూరు.





# గురుస్థానం - గురుహృదయంలోస్థానం

బిడ్డ బాధ్యత తండ్రిదే! జీవిత పయనంలో ఎదురయ్యే ఎన్నో సమస్యలకు ఆసరాగా, ఆలంబనగా నిలవవల్సిందే బిడ్డ పరిపూర్ణుడయ్యేవరకు. తండ్రి బిడ్డ యొక్క అవసరాలను తెలుసుకొని, వారి ప్రయత్నం వారు చేస్తుంటే, సద్గురువు జరగబోయే, జరిగిన అంశాలను క్రమబద్ధీకరించి, కావాల్సిన వనరులను సమకూరుస్తూ, బిడ్డకోసం, వాడి ప్రగతికోసం జగత్తు యొక్క 'గతి' నే మార్చగల సమర్ధుడయి ఉంటారు. అదే బాబా చరిత్రలో 'బాబా తన శరీరం చీల్చి బిడ్డను ప్రసాదించడం', 'మాలన్‌బాయిని బ్రతికించడం'. - గురుకృప

నా పేరు డి.వి.ఎన్. ఉమామహేశ్వరరావు, మాది కందుకూరు, ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నాను. నేను 1998 సంవత్సరంలో బి.యస్.సి. ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. నా class mates అయిన గణేష్, మాధవ, శ్రీధర్ వాళ్ళు గురువుగారి దగ్గరకు మరియు కందుకూరులో జరిగే సత్సంగములకు వెళ్లేవారు. గణేష్ మరియు నేను మా ఇంటిలోనే combined study చేసేవాళ్లము. గణేష్ నాతో గురువుగారి గురించి చెప్పేవాడు. మా అక్క శిరీష నెల్లూరు సత్సంగ సభ్యురాలు. వీళ్లనుంచి కూడా మేము కొంత గురువుగారి గురించి వింటుండే వాళ్లము, కాని నాకు అస్సలు ఇష్టం ఉండేది కాదు. గురువుగారి మహిమ, గొప్పదనం తెలియక కొన్ని, కొన్ని సార్లు ఆయన మీద కామెంట్స్ కూడా చేస్తుండేవాడిని. అందుకే గణేష్ మా మధ్యలో ఈ ప్రస్తావన చాలా తక్కువగా తెచ్చేవాడు.

కానీ "నా భక్తున్ని నేనే పిచ్చుక కాలికి దారం కట్టి లాగినట్లు నావద్దకు లాక్కుంటాను" అని బాబా అన్న మాట నా పట్ల ఖచ్చితంగా నిజమైనది. నేను final year చదువుతున్నాను. నాకు Intermediate నుంచి ఎప్పడయినా tension గా ఉన్నప్పడు, Rest లేనప్పడు బాగా తలనొప్పి వచ్చేది. అది ఎంత తీవ్రస్థాయిలో వచ్చేదంటే ఒక్కోసారి కళ్లు కూడా సరిగా కనిపించవు. కళ్లముందు అంతా చీకటిగా, blank గా అయినట్లు కనిపిస్తుంది. అస్సలు భరించలేనంత తలనొప్పి వచ్చేది. అలా ఎప్పడయినా వస్తే దాదాపు రెండు రోజులు బాధ అలానే వుంటుంది. రాత్రి పూట సరిగా నిద్రపట్టదు. అంత sever attack వస్తుంది. నేను మరుసటి ఉదయం Final Year Physics-III Paper Exam వ్రాయాలి. ఈ రాత్రికి బాగా తలనొప్పి మొదలయింది. Exam అవటం వలన కొద్దిగా hard గా చదవాల్సి వచ్చింది. అందువలననేమో! మొత్తానికి చాలా ఎక్కువగా ఉంది. నేను ఏమీ చదవలేకపోయినాను. రోజూ exams ఉండడం వలన, ఎప్పడో Revision చేసిన subject సరిగా గుర్తుకురావటంలేదు. మరుసటి రోజు ఉదయం 8.30 ని॥లకు exam అదీ Final year, ఏదయినా అటూ ఇటూ అయిందంటే Compartmental గా చదవాల్సి వస్తుంది. నాలో బాగా tension మొదలయింది. ఒక ప్రక్క ఏడుపు వస్తుంది కాని ఏమి చేయలేని పరిస్థితి. ఆ తలనొప్పి వచ్చేదే tension మూలంగా అప్పడు నా mental condition మరీ tension గా ఉంది.





బాబా-కృప వలన ఆ రోజు నైట్ నాతో గురుబంధువు అయిన గణేష్ కూడా ఉన్నాడు. ఎప్పుడయినా గణేష్ గురువుగారి గురించి గాని, బాబాలీలల గురించి గాని చెప్పినా అంతగా పట్టించుకునే వాడిని కాదు, కాని ఆ రోజు ఇక తప్పలేదు. అప్పటి పరిస్థితి నా చేతిలో లేదుకదా! గణేష్ తన దగ్గర ఉన్న బాబా-గురువుగారి Laminated Pocket Photo నా చేతికిచ్చి, "ఒక్కసారి బాబా, గురువుగారికి నమస్కారం చేసి పడుకో రేపటికి తగ్గుతుంది అని చెప్పినాడు". సరే, కొంచెం fresh గా అన్నా ఉంటే ఏదో విధంగా exam వ్రాసి కనీసం minimum marks తోనయినా pass అవ్వచ్చు కదా! అని, ఇక గత్యంతరం లేక ఆ photo తీసుకొని, అప్పడు ఉన్న నా పరిస్థితిని తెలుపుకుంటూ గురువుగారికి, బాబాకు నమస్కారం చేసుకొని ఆ photo ను దిండు క్రింద పెట్టుకుని పడుకున్నాను. మామూలుగా అయితే అలాంటి నైట్ సరిగా నిద్రపట్టదు. కాని ఆరోజు ఎంతో హాయిగా నిద్ర పోయినాను. ఉదయం నిజంగా చాలా fresh గా ఉన్నాను. ఇక నాకు confidence వచ్చింది. ఎలాగయినా exam వ్రాసి pass అవగలనని అనిపించింది. అప్పడే గురుదేవులకు నే మొదటిసారి జీవితంలో కృతజ్ఞతలు చెప్పకున్నది. ఇక exam వ్రాయాలి. పరీక్షకి వెళ్లేముందు మా కాలేజ్ పక్కనే ఉన్న బాబా గుడికి పోయి వెళ్దామని అన్నాడు గణేష్, నేను సరే అని ఒక గంట ముందుగా బయలుదేరి గుడికి వెళ్లినాము. ఆ పరీక్షకి ఏదయినా revision చేసినాను అంటే, అది ఆ బాబా గుడిలో కూర్చోని ముఖ్యమైన ప్రశ్నలు ఒక్కసారి పైపైన చదవటమే! exam hall లోకి వెళ్లి ప్రశ్నాపత్రము చూస్తే దాదాపు 70 శాతం ప్రశ్నలు నేను గతంలో బాగా చదివిన ప్రశ్నలే. అందులోను చాలా ప్రశ్నలు బాబా గుడిలో కూర్చోని పైపైన చదివినవే అవటంవలన full confidence తో exam attempt చేసినాను. Revision సరిగా లేనందువలన అంత బాగా వ్రాయనప్పటికి బాబా-గురువుదేవుల దయవలన అనుకున్న దానికంటే బాగానే వ్రాసినాను. సందేహం లేకుండా పరీక్ష పాస్ అయితీరుతాను అనిపించింది. ఇక అప్పటినుండి పరీక్షలు జరిగినంతకాలం బాబా గుడికి వెళ్లడం సెంటిమెంట్ అయింది. గురువుగారు చూపిన దయకు ఎవరు అయినా ఆయనకు surrender అవ్వాల్సిందే - నా పరిస్థితి కూడా అదే. గురుదేవుల మీద మంచిగా నమ్మకం కుదిరింది. సాయిప్రసాద్ సార్ మాకు maths lecturer, కందుకూరులో సత్సంగం నిర్వహించే సాయిప్రసాద్ సార్ అంటే కొంచెం భయం ఉండేది, అందువలన మొదట్లో సత్సంగమునకు వెళ్లేవాడిని కాదు. నిదానంగా ఒక నెల తరువాత తరచుగా వెళ్లడం అలవాటు చేసుకున్నాను.

బహుశ 1998 మే చివరిలో మా బి.యస్.సి. పరీక్ష ఫలితాలు వచ్చినాయి. ఎంతో ధీమాగా results చూచుకుంటే పేపర్‌లో నంబరు లేదు. విషయం ఏమంటే డిగ్రీ ఫెయిల్. ఏది అయితే జరగకూడదు అనుకున్నానో అదే జరిగింది. ఏ పేపర్ పోయిందో అర్థం కాలేదు. Physics - III పేపర్ మీదా అస్సలు డౌట్ లేదు. ఖచ్చితంగా పాస్ అయితీరుతాను. కొన్నిరోజులకు వచ్చిన మార్క్స్ షీట్ చూస్తే అందులో Physics - III Fail అయినాను అని తేలింది. కాని పరీక్ష బాగా వ్రాయటంతోనే నాకు గురువుగారి పట్ల దృఢమయిన అభిప్రాయం ఏర్పడింది. అందుకే ఎటువంటి అపనమ్మకం





పెట్టుకోకుండా Revaluation కి అప్లై చేసినాను కాని మనస్సంతా చాలా బాధగా ఉంటుండేది. నాతోటి వారందరు పాస్ అయినారు. మా బాచ్‌లో నేను ఒక్కడినే పాస్ కాలేదు. అందుకే వారితో కలిసి ఎప్పుడయినా బయటకు వెళ్ళాల్సి వచ్చినా, క్రికెట్ ఆడుకోవాల్సి వచ్చినా, చాలా Ashame గా ఫీల్ అయ్యేవాడిని అయినా సత్సంగమునకు రోజూ వెళ్లేవాడిని.

నేను అప్పటికి షిరిడీ చూడలేదు. గురువుగారిని చూడలేదు. 1998 జూలైలో వచ్చిన గురుపౌర్ణమికి మా అక్క శిరీష, బావ వెంకటేశ్వర్లు నెల్లూరు నుండి షిరిడీ వెళుతూ కందుకూరు వచ్చినారు. నేను కూడా వాళ్లతో వెళ్తానని మా అమ్మను అడిగినాను. అక్కవాళ్ళకు రిజర్వేషన్ అయినది నాకు రిజర్వేషన్ లేదు, గురుపౌర్ణమి అవటం వలన రైళ్లు బాగా రద్దీగా ఉన్నాయి. రిజర్వేషన్ దొరికే అవకాశము లేదు. మొదట ఒప్పుకోని అమ్మ-నాన్నలు ఎలాగయినా షిరిడీ వెళ్లాలని గురువుగారికి ప్రస్తుత నా పరిస్థితి చెప్పుకోవాలని నిర్ణయించుకున్న నన్ను బాబా, గురువుగార్ల దయవలన వెళ్లడానికి చిట్టచివరికి అనుమతించినారు. వేము షిరిడీ రావాలంటే కందుకూరు-హైదరాబాద్-షిరిడీ రావాల్సి ఉంటుంది. కందుకూరు-హైదరాబాద్ ప్రయాణం చాలా కష్టంగా జరిగింది. కనీసం free గా నిలబడడానికి చోటుకూడాలేదు. నా సామాన్లు అక్కవాళ్ల రిజర్వేషన్ కంపార్టుమెంట్‌లో పెట్టి నేను జనరల్ కంపార్టుమెంటులో ఎక్కినాను. చాలా సేపు నిలబడాల్సి వచ్చింది. చాలా సేపు గేట్ మెట్ల వద్ద కూర్చొని వచ్చినా గురువుగారిని కలవబోతున్నందుకు సంతోషంగానే ఫీల్ అయినాను. రాత్రి పూర్తిగా నిద్ర లేకపోయినా పెద్ద కష్టమేమీ అనిపించలేదు.

హైదరాబాద్ నుండి Manmad Express లో షిరిడీ వెళ్ళాల్సి ఉంది. ముందు రాత్రి పూర్తిగా నిద్రలేదు, నిద్రలేకపోతేపోయింది కనీసం మాట్లాడుకోవటానికి తోడు ఎవరూ లేకపోవడంతో అప్పడప్పుడూ కొంచెం బోర్ ఫీల్ అయినాను. ఇక్కడకూడా రిజర్వేషన్ లేదు మరలా ముందురోజు రాత్రి పరిస్థితే వస్తుందేమో అనుకున్నాను. కాని బాబా దయ ఈ సారి వేరుగా ఉంది. మా బావ వచ్చి వాళ్ల కంపార్టుమెంటులో ఒక సీటు ఉంది రమ్మని పిలిచినాడు. అంత రద్దీగా ఉన్న రైలులో రిజర్వేషన్ సీటు దొరకడం విశేషం. అసలు ఆ సీటు ఒక రైల్వే ఉద్యోగిది. ఆయన, భార్య, ఇద్దరు చిన్న పిల్లలు Manmad వెళ్తున్నారట. వాళ్లకు 4 బెర్తులు అయితేనే చాలా ఎక్కువ అలాంటిది ఆయన 6 బెర్తులు రిజర్వ్ చేయించుకొన్నాడు. అందులో ఒక బెర్త్ నాకు ఇచ్చినారు. ఆయనతో మాట్లాడే సమయానికి నేను already General Ticket కొన్నాను. కాని ఆయన నీకు ఇపుడు జనరల్ టికెట్ అవసరం లేదు నీ జనరల్ టికెట్ రిటర్న్ చేసి ఈ బెర్త్‌లో free of cost తో రావచ్చు అని చెప్పినాడు. రిటర్న్ చేసి తిరిగి రావటానికి టైం ఉన్నాకాని ఎందుకో ధైర్యం చేయలేక ఆ టికెట్ నాతోనే ఉంచుకున్నాను. మరో విశేషం ఏమంటే నాకు రిజర్వ్ అయిన బెర్త్ మా అక్కవాళ్ల కూపికి Immediate గా ప్రక్కది. నాకు తోడు లేదు అన్న దిగులు కూడా తీరిపోయింది. ఇది తలుచుకున్నప్పడల్లా నా కోసం టికెట్ రిజర్వ్ చేయించి మరీ నన్ను తన వద్దకు తీసుకున్న బాబా ప్రేమకు సంతోషపడ్డాను.

ఇక షిరిడీలో, మొదటిసారి కాకడ హారతిలో నేను బాబాను చూచినాను. నా జీవితంలో



మొదటిసారి బాబాను చూడటం. అంత ఉదయాన్నే ఆ వెలుగులు చిమ్ముతున్న బాబాను చూడగానే ఎంతో పులకరింపుగా అనిపించింది. ఆ అదృష్టం జీవితంలో మరువరానిది. ఇప్పటికి నా కళ్లలో అది మెదులుతూ ఉంది.

అప్పటికి ఇంకా గురువుగారిని చూడలేదు. మా సాయిప్రసాద్‌సార్ చెబుతూ ఉంటారు, గురువుగారితో ఋణానుబంధం పెంచుకోవాలంటే ఆయనకు సంభందించిన పని ఏదో ఒకటి చేస్తుండాలి అని. అప్పడు Saipatham Construction జరుగుతుంది. నేను ఏదో చిన్న చిన్న పనులు చేసినాను. కాని నేను ఆయనకు చెప్పకోవాల్సింది చాలా ఉంది. ముందు ఆయనతో మాట్లాడాలి. ఆ భాగ్యం కోసం ఎదురుచూస్తున్నాను. కాని నాకు తెలిసింది ఏమంటే, బహుశా గురువుగారు ఈసారి పర్సనల్ ఇంటర్వ్యూస్ ఇవ్వకపోవచ్చు అని. అది విన్నాక చాలా బాధ, భయం కల్గినాయి. అలాగే జరుగుతుందేమో! అనుకున్నాను. రేపు బయలు దేరుతాను అనగా ఈ రోజుకు కూడా మరి గురువుగారు పర్సనల్ ఇంటర్వ్యూస్ ఇవ్వడం లేదు. గురువుగారు నన్ను అనుగ్రహించరేమో! అనిపించింది. నాకు షిరిడీలో ఎవరూ తెలియదు మా అక్కవాళ్ళతో వచ్చినాను వాళ్ళతోనే బయలుదేరాల్సి వచ్చింది. రేపు ఎటూ ఊరికి వెళ్లాలి. గురువుగారి పర్సనల్ ఇంటర్వ్యూ లభించలేదు. ఆ బాధ మనస్సులో ఉంది. ఆ రాత్రి ఎప్పడు గురుస్థానంలో ప్రదక్షిణలు మొదలు పెట్టినానో గుర్తులేదు కాని మొత్తానికి ఉదయం 4.30 - 5.00గం॥ ల వరకు ప్రదక్షిణలు చేసినాను. ప్రదక్షిణలు పూర్తి చేసుకొని నేరుగా 'Saiyana' కి వచ్చిన నేను కనీసం నా చెప్పలు అయినా విప్పనేలేదు! మా అక్క పరుగున వచ్చి "రాత్రి ఎక్కడకు వెళ్ళావురా! గురువుగారు రాత్రి చాలాసేపటినుండి పర్సనల్ ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. బహుశా close చేయబోతున్నారు త్వరగా పో" అంది. నాకు ఆ సమయంలో ఆనందం కంటే ఆశ్చర్యమే ఎక్కువ కల్గింది. పరుగెత్తుకుని పోయి రౌండ్ హట్ ముందు ఉన్న క్యూలో నిలబడ్డాను. నేను క్యూలో చివరివాడిని నాతోనే బయట డోర్ మూసివేసినారు. నన్ను అనుగ్రహించటానికేనేమో నేను వచ్చేదాక తలుపులు తెరిచిపెట్టి ఉంచినారు. రౌండ్ హట్ నిర్మాణం పూర్తికాలేదు. తలుపులు, కిటికీలు ఏమీ లేవు. గురువుగారు బయట క్యూలో ఉన్న వారందరికీ కనిపిస్తున్నారు. నేను చూచినపుడు గురువుగారు నిలబడి ఉన్నారు. గురువుగారు నిలబడి ఉండడం చూచి ఇక నన్ను అనుగ్రహించకుండా వెళ్లిపోతారేమో! అని భయం వేసింది. నేను మనస్సులో సంఘర్షణ పడుతున్నాను. తలుపులు, కిటికీలు లేకపోవటం వలన గురువుగారు క్యూలోని మా అందరకు కనిపిస్తున్నారు. మేము గురువుగారికి కనిపిస్తున్నాము. గురువుగారు నావైపు చూస్తూ రమ్మని సైగ చేసినారు. **గురువుగారిని నేను కనీసం ఫోటోలో అయినా చూచినాను, కాని గురువుగారు నన్ను ఎప్పడూ చూడలేదు.** ఆయనకు అందరూ బాగా తెలుసునని నాకు అప్పట్లో తెలియదు. నాకు, నన్నేనా పిలిచింది అనిపించింది. అనుమానంగా మరలా గురువుగారివైపే చూచినాను. మరలా అదే విధంగా సైగ చేసినారు, ఇక పిలిచింది నన్నే అనుకొని confirm అయి క్యూలోని వాళ్లను దాటి రౌండ్ హట్ గుమ్మం ముందుకు వెళ్లినాను. అక్కడ రామమూర్తి (వెంకటగిరి) గారు క్యూని కంట్రోల్

చేస్తున్నారు. ఇంతమంది ఉంటే నువ్వు ఎక్కడికి అన్నట్లు సైగతో మరలా క్యూలోనికి వెళ్లి నిలబడమన్నారు. నేను చేసేది ఏమీ లేక గురువుగారి వైపు చూచినాను. అప్పుడు గురువుగారు **"బాబుని లోపలికి పంపు"** అన్నారు. **గురువుగారి నోట మాట వినటం అదే ప్రధమం.** అలా **గురువుగారు పిలవటం ఇప్పటికీ మరువలేను.** నాకు అప్పుడు తెలియక అందరితో గురువుగారు ఇలానే మాట్లాడుతారు అని అనుకునేవాడిని, కాని ఇప్పటి పరిస్థితి చూచిన తరువాత, నన్ను ఎంత ప్రేమతో ఆయన వద్దకు పిలుచుకున్నారో అర్థమవుతుంటే ఎంతో సంతోషంగా ఉంది. **గురువుగారి పాదపద్మములకు జీవితంలో మొదటిసారి నమస్కరించుకున్నాను.** ఎందుకో తెలియదు గురువుగారిని అలా చూడగానే పట్టరాని ఏడుపు వచ్చింది. చాలాసేపు అలా ఏడుస్తూనే వున్నాను. ఆయన మాత్రం నన్ను అలా ప్రశాంతంగా చూస్తూనే ఉన్నారు. అంతా అయిపోయిన తరువాత "ఊ....చెప్పు" అన్నారు. చెప్పకోవాల్సింది దాదాపు 4 నెలల బాధ అంతా ఆయనకు చెప్పినాను. ఆయన ఊదీతో నన్ను ఆశీర్వదించినారు. అలా నా మొదటి షిరిడీ ప్రయాణం చాలా అద్భుతంగా జరిగింది.

షిరిడీ నుండి వచ్చిన 10-20 రోజులలో నా revaluation results వచ్చినాయి. ఈ results నేను రిసీవ్ చేసుకోవడం కూడా బాబా దయే! అన్నట్లు నాకు ఒక నిదర్శనం అయింది. నేను ఆ రోజు ఉదయాన్నే ఇంకా results చూచుకోలేదు, results వస్తాయి అని కూడా నాకు తెలియదు. కాని నా స్నేహితులు, గురుబంధువులైన మాధవ, శ్రీధర్ ఉదయాన్నే కందుకూరు సత్సంగమందిరముకి వచ్చే న్యూస్ పేపర్‌లో నా results చూచి మా ఇంటికి వచ్చి విషయం చెప్పినారు. వాళ్లు చెప్పేదాక నాకు పాస్ అయిన సంగతి తెలియదు. **Results పేపర్ సత్సంగ మందిరం నుండి రావటం నిజంగా విశేషం అనిపించింది.** మొత్తానికి బాబా-గురుదేవుల అనుగ్రహం వలన డిగ్రీ ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయినాను. ఆ వెంటనే కొన్ని రోజులకు ఎమ్.సి.ఎ. కూడా జాయిన్ అయినాను.

రైలులో రిజర్వేషన్ టికెట్ ఇవ్వడం, వారి దయవలన బాగా వ్రాసిన పరీక్ష ఫెయిల్‌అయి పాస్‌అవ్వటం, గురుదేవులు ప్రేమగా పిలిచి ఆశీర్వదించటం. ఇదంతా నాదయే అన్న నిరూపణగా సత్సంగమందిరం నుండి results పాస్ అయినట్లు తెలియటం అంతా నాటకీయంగా ఉన్నా ఇది ఖచ్చితంగా నిజం.

నాకు ఎప్పుడో కల్గిన ఈ అనుభవం ఇంత లేట్‌గా మీతో పంచుకుంటున్నందుకు సిగ్గు పడుతున్నా కనీసం ఇప్పటికయినా నాకు 'ఆ మనస్సు కల్గించిన' బాబా-గురుదేవుల పాదపద్మములకు సాష్టాంగ నమస్కారములతో ముగిస్తున్నాను.

- డి.వి.ఎన్. ఉమామహేశ్వరరావు, కందుకూరు.

నేర్చుకునే దృక్పథమే మనకుంటే, నిత్యజీవితంలో మనకు జరిగే ప్రతి సంఘటన సద్గురులీలా ప్రబోధమేనని తెలుసుకోగలుగుతాము. - శ్రీ బాబూజీ





# చేతన్ అన్నపేరు-వారి చైతన్య స్వరూపానికి మారుపేరు

ఈ సృష్టిలో జన్మించిన ప్రతి జీవి, ఖచ్చితంగా కారణమాత్రుడయి ఉన్నాడన్నది సత్యం. సద్గురువుకు శరణాగతి చెందే ప్రయత్నంలో భాగంగా కేవలం ఒక్క అడుగువేస్తే, క్షమించాలి, ఆ అడుగు కూడా కాదు, కేవలం వారిని స్మరిస్తే 'ఉద్ధరణ' కార్యక్రమం మొదలన్నది గురుదేవుల విషయంలో నిత్యసత్యం. మొక్కు తీర్చుకొమ్మని శ్యామాను 'వణి'కి పంపి, కాకాజీ వైద్యను తన సన్నిధికి రప్పించుకున్నారు బాబా. ఇలా ప్రతిజీవిని ఉద్ధరించడం కోసంగా వీరి వద్ద 'శాశ్వత ప్రణాళిక' ఉందేమో! బాబా వద్దకు వచ్చాక, అందునా గురుపథంలో పయనించడం మొదాలెట్టాక, జాతకాలు, సాముద్రికాలకు ప్రాధాన్యత లేదన్నది సద్గురువాక్యం. సంస్కారం మనలను వెనకకు నెట్టినా, వారి అనుగ్రహముతో (అదొక పెద్ద ఉప్పెన.) మన సంస్కారాలు కొట్టుకుపోయి, వారి మమకారం ముందు నిలువలేక ఏదో ఒక రోజు వారి మార్గమే మనకు రాచమార్గమై, వారే సర్వస్వం కాగలరు. 'చేతన్' అన్న పేరుతో, మన నిత్యజీవితంలో, చివరకు మన భావనలో కూడా వారు 'చైతన్య' స్వరూపులై ఉన్నారని గురుదేవులు తెలియపరచినవైనం. - గురుకృప

పూజ్యనీయులైన గురుదేవులు శరత్‌బాబూజీకి నమస్కరించి నా అనుభవాన్ని మన గురు కృపకు తెలియజేసుకుంటున్నాను. నేను హైదరాబాద్‌లో డెంటిస్ట్‌ని. మా వారు హైకోర్టులో అడ్వకేట్. మేము చాలా కాలంగా గురుబంధువులం. మాకు 1996 ఆగష్టు 9న బాబా అనుగ్రహంతో గురువుగారి దయవలన బాబు పుట్టాడు. వాడికి రెండునెలలు నిండేంతవరకు నేను మా పేరెంట్స్‌తో హైదరాబాద్‌లోనే ఉన్నాను. మా ఫాదర్, మిగతా వాళ్ళందరూ నక్షత్రం, తిథి చూసుకొని జాతకరీత్యా బాబు పేరుకు "చ, చే" తో మొదట అక్షరం ఉండాలి, అలాగే పేరు పెట్టాలన్నారు. నాకు కూడా కాస్త ఆ సెంటిమెంట్ అలానే ఉండేది. అలాగే పేరు పెట్టాలేమో అనుకున్నాను. కానీ మావారు మనము గురువుగారి దర్శనం, బాబా దర్శనం చేసుకొన్న తరువాత బాబుకు పేరు పెడదాము అన్నారు. సరే అని షిరిడీ బయలు దేరాము. షిరిడీలో సాయిబాబా దర్శనం చేసుకొని, గురువుగారి దర్శనం బాబుకు చేయించి, గురువుగారి ఆశీర్వాదం తీసుకున్నాము. బాబుకు గురువుగారిని పేరు పెట్టమని, మీరు ఏ పేరు పెట్టినా సంతోషమని గురువుగారికి విన్నవించుకున్నాము. గురువుగారు చిరునవ్వుతో బాబుని ముట్టుకొని "సాయిచేతన్" అని పేరు పెట్టారు. నాకు ఆ పేరు వింటూనే, ఆశ్చర్యం వేసింది. ఎందుకంటే మా పేరెంట్స్ హైదరాబాద్‌లో బాబుకు "చే" తో పేరు పెట్టాలని పేర్లు వెతుకుతున్నారు. ఆ విషయం నేను మాట మాత్రంగా కూడా గురువుగారికి కాని గురుబంధువులకు గాని ఎవ్వరికీ చెప్పలేదు. అటువంటిది మేము ఎక్కడో హైదరాబాద్‌లో అనుకున్న విషయాన్ని గురువుగారు కనీసం ఒక నిముషం కూడా పేరు గురించి ఆలోచించకుండా టక్కున చేతన్ అని పేరు పెట్టేశారు. ఆ పేరు "చే" తోటే మొదలయ్యింది. నాకు చాలా ఆనందంవేసింది. ఎందుకంటే గురువుగారితో బాబుకు పేరు పెట్టించుకోవాలనుకున్న మా కోరిక ప్రత్యక్షంగా, జాతకంతో పేరు కలవాలి అన్న మా పెద్దవాళ్ల కోరిక పరోక్షంగా రెండూ తీర్చారు గురువుగారు.

ఉమ, డెంటల్ సర్జన్, హైదరాబాద్





# సాధన ఒకింత - ఫలితం పసిడంత

పూజ్య గురుదేవులకు పాదనమస్కారములతో - నా పేరు వి. వల్లీ. నేను విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ చైతన్య పబ్లిక్ స్కూల్లో 7వ తరగతి చదువుతున్నాను. నాకు గురూజీ ఇచ్చిన అనుగ్రహానుభవాన్ని గురుబంధువులతో పంచుకుంటున్నాను. స్టీల్‌ప్లాంట్ క్వార్టర్సులో లతఆంటీగారింటియందు ప్రతి శనివారం జరిగే సత్సంగానికి మా అమ్మ వెళ్తూ ఉంటుంది. నేను వీలుఅయినప్పుడు వెళ్తూ ఉంటాను.

మా స్కూల్లో రోలర్‌హాకీ సెలక్షన్స్ జిల్లాస్థాయిలో జరుగుతున్నాయి. అపుడు ఆ టీములో నా పేరు సెలక్టు చేయడం జరిగింది. ఈ విషయాన్ని నేను ఒక రోజు సత్సంగానికి వెళ్ళి గురువుగారితో ఇలా చెప్పకున్నాను. "గురువుగారూ! మాస్కూల్లో జరుగబోవు రోలర్ హాకీ టోర్నమెంట్సులో నాపేరు తీసుకున్నారు. ఎలాంటి రాజకీయాలు చేయకుండా ఉండేటట్లు చూడండి" అని చెప్పకుని తర్వాత మా అమ్మ, నాన్నగారి పర్మిషన్ తీసుకున్నాను.

దసరాకు ముందు జరిగిన ఈ టోర్నమెంట్సులో నాకు గోల్డ్‌మెడల్ వచ్చింది. ఇది నిజంగా నాకు గురూజీ ఇచ్చినదే. ఎందుకంటే నాకు అప్పటివరకు దాదాపు ఏమీ అనుభవంలేదు, కానీ ముందుగా నేను గురువుగారితో చెప్పకుని గేమ్‌లో పాల్గొనే దాన్ని. నిజంగానేను ఆ గేమ్ చాలా బాగా ఆడగలిగాను అంటే అది గురువుగారి అనుగ్రహము వలన మాత్రమే. ఈ విషయాన్ని మా అమ్మనాన్నలు కూడా తెలిపారు. నా ఆట తీరు వాళ్ళకు ఆశ్చర్యం కలిగించిందట. ఆ గేమ్ పూర్తయిన తర్వాత ఇంటికి వచ్చి గురువుగారికి పాదనమస్కారములు తెలియజేసుకున్నాను.

మళ్ళీ ఒక రోజు సత్సంగానికి వెళ్ళి మళ్ళీ మా స్కూల్లో జరుగుబోవు రాష్ట్రస్థాయి రోలర్‌హాకీ టోర్నమెంట్సులో నేను ఆడాల్సివుంది, "గురువుగారూ! నేను రాష్ట్రస్థాయి రోలర్‌హాకీ టోర్నమెంట్సులో ఆడబోతున్నాను. 'నన్ను అలా ముందుకు తీసుకు వెళ్లడం' నాకు మంచిదయితే తీసుకువెళ్లండి లేకపోతే మీయిష్టం" అని చెప్పకున్నాను. నవంబరు 2002వ సంవత్సరంలో జరిగిన ఆ టోర్నమెంట్సులో నాకు మళ్ళీ గోల్డ్‌మెడల్ వచ్చింది. ఇక నా ఆనందానికి అవధులు లేవు. గురువుగారి అనుగ్రహం నామీద ఎంతగా ఉన్నదో నాకు అర్థమయింది. గురువుగారి అనుగ్రహం నాపై ఎల్లప్పడూ ఉండాలని కోరుకుంటున్నాను.

వి. వల్లీ, విశాఖపట్నం.

**కొబ్బరి చెట్టును గమనించు**

**కొబ్బరి మొక్క పెరిగేకొద్దీ దానికున్న పాతమట్టలు వాటంతటవే రాలిపోతాయి. మానవునిలో ఆత్మనుభూతి వికాసం పొందుతున్నంతకాలం కులమత భేదాలవంటివి తొలగిపోతవి. వ్రణం మానటం ఆరంభమైతే దానిపై నున్న కట్టుపొలుసు సహజంగానే రాలిపోతుంది. వ్రణం మానకముందే పొలుసును లాగే ప్రయత్నం చేస్తే గాయం మరింత పెరుగుతుంది. రక్తం ధారలా కారుతుంది. జీవుడెలా అద్వైత భావాన్ని అంటి పెట్టుకోవాలో, దాన్నెలా సాధించాలో రామకృష్ణ పరమహంస వాణి అది.**





# ఆశ్రిత రక్షణే కాదు, అనుభంధీకులదీ కూడా

వారి చెంతకు చేరిన జీవుల యొక్క సంబంధీకుల బాధ్యతను కూడా వారు వహించే వైనాన్ని బాబా చరిత్రలో మనం స్పష్టంగా చూడవచ్చు. కాకా దీక్షిత్ సోదరునికి అనారోగ్యం చేకూరడంతో దీక్షిత్ తాను ఏమీ చేయలేక పోతున్నానని బాబా వద్ద బాధపడతాడు. భక్తుని బాధ్యత స్వీకరించిననాడే, అతని కుటుంబ బాధ్యత కూడా స్వీకరిస్తారు-సద్గురువు. అందువల్లనే దీక్షిత్ వెళ్ళవలసిన అవసరం లేదని, తాను అతనికి కావల్సిన వాటిని చేకూర్చతానని బాబా చెప్పడం చూస్తాం. బాబా చెంతన జరిగిన ప్రతీలీలకు ఈనాడు సజీవ నిరూపణ గురూజీ జీవితం, వారి చర్యలు, వారి లీలా ప్రబోధాలన్నది మరోసారి వ్యక్తమవుతుంది క్రింది లీలలో నాడు తమ్ముడు, నేడు తోడల్లుడు. -గురుకృప

మా తోడల్లుడు శ్రీ శాఖమూరి వెంకటరామయ్య రిటైర్డ్ ప్రిన్సిపల్ గారిని 2002 సెప్టెంబరు నుండి గొంతుకు ఇన్ఫెక్షన్ వచ్చి మాట స్పష్టంగా రావటం లేదు. తెనాలిలోను, విజయవాడలో "సౌమ్య అపోలో" హాస్పిటల్‌లలో చూపించారు. బెంగుళూరులోని ఇ.ఎన్.టి. స్పెషలిస్ట్ గారికి చూపించారు. వారు అన్ని పరీక్షలు చేసి స్వరపేటికకు క్యాన్సర్ ఎటాక్ అయినదని అది ఫస్ట్ స్టేజ్ దాటి సెకెండ్ స్టేజ్‌లో వున్నదని చెప్పినారు. వీరికి ట్రీట్‌మెంట్ నిమిత్తం రేడియేషన్ 25 నుండి 30 సార్లు ఆల్టర్‌నేట్ డేట్స్‌లో ఇవ్వవలయునని చెప్పినారు. మా తోడల్లుడుగారి వయస్సు 75 సంవత్సరాలు. పెద్దవయస్సు వలన ఈ ట్రీట్‌మెంట్ వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయేమోనని, డాక్టరుగారు అనుమానించారు. పేషెంట్ కోపరేషన్ వలన ఈ ట్రీట్‌మెంట్ ఆధారపడివుంటుందని డాక్టర్‌గారు చెప్పినారు. మా వదినగారికి, వారి అమ్మాయి (లక్ష్మి)కి వాని పిల్లలకు గురువుగారి యందు, బాబావారి యందు పూర్తి విశ్వాసము. వారు భారము బాబాపై వేసి రేడియేషన్ ట్రీట్‌మెంట్ ప్రారంభించారు. 4, 5 ట్రీట్‌మెంట్స్ జరిగిన సమయానికి గురువుగారు ఉగాదికి షిరిడీ వచ్చినారు.

ఉగాది వెళ్ళిన తరువాత నెల షిరిడి వెళ్ళినాను. నేను ఏప్రిల్ 13వ తేదీన రాత్రి 10-40 ని॥లకు గురువుగారి దర్శనము చేసుకొనినాను. అప్పడు గురువుగారికి మా తోడల్లుడి పరిస్థితి వివరించి, వారిని ఆనారోగ్యము నుంచి కాపాడమని, వారి కుటుంబమునకు సుఖశాంతులు ప్రసాదించమని కడుదీనముగా వేడుకున్నాను. కరుణామయుడు, ఘటనా ఘటనసమర్ధుడగు గురూజీ నా మొరను ఆలకించి, వారి కుటుంబమును కరుణించి ఆశీర్వదించినారు. ఆరోజున కరెక్టుగా రేడియేషన్ ట్రీట్‌మెంట్ వచ్చినది. ఆరోజునుంచి మాట స్పష్టంగా క్రమేపి వచ్చినది. గురువుగారు ఆశీర్వదించారని బుర్రిపాలెంలోని నా శ్రీమతికి, బెంగుళూరులోని మా తోడల్లుడుగారి అమ్మాయి లక్ష్మికి ఫోన్ చేసి చెప్పినాను. రేడియేషన్ ట్రీట్‌మెంట్ 25సార్లు జరిగిన పిమ్మట మే నెల మొదటి వారంలో తిరిగి తెనాలి వచ్చినారు. మరలా టెస్టింగ్ నిమిత్తం 24న బెంగుళూరు వెళ్ళినారు. డాక్టర్‌గారు పేషెంట్‌ని చూచి, వారి డెవలప్‌మెంట్ చూచి ఆశ్చర్యపోయారు. టెస్ట్ చేసి అంతా బాగయిందని చెప్పి ఆశ్శర్యపోయారు. కరుణామయులయిన గురూజీ ఆశీర్వచనముల వలన వారి జఠిలమైన వ్యాధి నయమయిందని, మా కుటుంబములో యావన్మంది సంతోషముతో గురూజీ లీలను గురుబంధువులతో పంచుకొనవలయుననే కోరికతో గురుకృపకు పంపుతున్నాను.

శాఖమూరి వెంకటనారాయణ, బుర్రిపాలెం, తెనాలి



# ఆపదలో, ఆలోచనతో ...... గురుకృప

ప్రియమైన గురుబంధువులకు,

నా పేరు కుమార్, నా వయస్సు 19 సంవత్సరాలు. నేను డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాను. నేను "గురుకృప" జన్మదిన సంచికను చదివాను. అందులో శ్రీ గట్టా రత్తయ్యగారి యొక్క అనుభవము "ఆ క్షణాన....ఆ రెండక్షరాలే మృత్యుంజయ మంత్రమై రక్షించే" అనుదానిని చదివితిని. దానిని చదివిన నాకు, నా జీవితంలో జరిగిన ఒక సంఘటనను మీ ముందు ఉంచాలని, బాబాగారి మరియు గురువుగారి మహిమను మీకు తెలియజేయాలని స్ఫూర్తి కలిగింది. ఆ రోజు, అనగా తేదీ 27-1-2000, నేను, నా స్నేహితులు వంశీ, కరుణ, చిన్నా వాళ్ళతో మన గురువుగారిచే స్థాపింపబడిన సాయి బాబా మిషన్ సెంట్రల్ స్కూల్ నందు క్రికెట్ ఆడుకుంటున్నాము. అంతలో బంతి వెళ్ళి ప్రక్కనే ఉన్న బావిలో పడింది. నేను దానిని తీద్దామని బావిలోకి దిగాను. నాకు ఈత రాదు. అయినాకాని అందులోకి దిగి బంతి తీసి పైకి విసిరి వేశాను. అంతవరకు బాగానే జరిగింది. బంతి పైకి వచ్చినందున మిగతా వారందరూ బావి దగ్గర నుండి వెళ్ళిపోయారు. చిన్నా ఒక్కడు మాత్రం నా కోసం అక్కడ ఉన్నాడు.

నేను బావిలోకి మెట్లు ద్వారా దిగాను. అలానే పైకి వచ్చేద్దామనుకొని ఒక మెట్టుపై కాలు పెట్టి మరో చేత్తో పై మెట్టును పట్టుకున్నాను. ఆ చేయి అప్పటికే, బాలు తీసినందువల్ల తడిగా ఉంది. ఇంకొక చేయితో పై మెట్టు పట్టుకోబోయాను. అంతలో ఈ చేయి తడిగా ఉన్నందువల్ల అది జారి, నేను బావిలో పడిపోయాను. అప్పడు ఇక నా పరిస్థితి వర్ణణాతీతం. అంతలో నా స్నేహితులగు కరుణ, వంశీ పరుగెత్తుకువెళ్ళి ఎదురింట్లో ఉన్న తాడు తేవటానికి వెళ్ళారు. బావిలో పడ్డనేను. పడిన వెంటనే 'బాబా! ఇక అయిపోయాను" అని అనుకున్నాను. ఆ మాట అనిన వెంటనే కాళ్ళు, చేతులు ఆడిస్తున్న నాకు ఒక పైపు చేతికి తగిలింది. అది మోటరుకు వేసే పైపు. అది పాతబడి పోయినందువల్ల నేను పట్టుకోగానే చేతికి ఊడి వచ్చినది. దానిని పట్టుకొని పైకి చూస్తే చిన్నా ఒక్కడే అక్కడ ఉన్నాడు. నేను ఆ పైప్ చిన్నా చేతికి అందించాను. అతడు దానిని పట్టుకొని నన్ను పైకి రమ్మన్నాడు. నేను మెల్లగా దానిని పట్టుకొని పైకి వచ్చాను. అసలు అలాంటి విపత్కర పరిస్థితుల్లో అంత ఆలోచన రావటం నిజంగా బాబాగారి కృప. నన్ను ఇలాంటి పరిస్థితి నుండి కాపాడిన గురువుగారికి, బాబాకి హృదయపూర్వకంగా నమస్కరిస్తూ....

డి.జి.యస్. కుమార్, ఒంగోలు.

సర్వాన్ని భగవత్స్వరూపంగా దర్శించిన బాబాకు బొమ్మలు మాత్రం దైవం కాకుండా పోతాయా?
అయితే కేవలం బొమ్మలే దైవం అని మనం భ్రమించరాదు. -సా.భ.సా.ర.





**ఆచేయి ఎంత హాయి**

# గురునామ స్మరణమే.... అసలయిన గురుపూర్ణిమ

మానవాభ్యుదయాభిలాషులైన మహాత్ములు, తమ మేధస్సునుపయోగించి మానవుణ్ణి తరింపచేయటానికి, దైవసాక్షాత్కారాన్ని పొందటానికి సద్గురునిచరణ సన్నిధికి సులువుగా చేరుటకు, ఆత్మానుభూతిని పొందుటకు వివిధ మార్గాలను చూపారు. ఎన్నో విషయాదులను గ్రంధాలందు పొందుపరచినారు. భాగవతములో భక్తి మార్గమును వివరించుతూ తొమ్మిది విధములైన భక్తి మార్గాలను చూపింది. ఇవి కాకుండా మరో 180 భక్తిమార్గాలను, వాటి ఆచరణ విధాలను కూడా చూపింది. ఇవికాకుండా మరికొన్ని త్రోవలున్నాయన్న విషయం చాలా మంది గమనించరు. ఈ మధ్య కాలంలో మన గురుదేవులు "నామజపమును" ప్రతి సత్సంగకేంద్రము వారు ఆదివారము రోజున చేయమని మనలను ఆశీర్వదించినారు. ప్రతి సత్సంగ సభ్యుడేకాక, ప్రతి సాయిభక్తుడు, బాబా చరణసన్నిధికి చేరవయ్యేందుకు గురుదేవులు చూపించిన సులువైన భక్తిమార్గం - నామజపం. పెద్దలవలన విన్నవి, గ్రంధములందు క్రోడీకరించినవి, మొదలగు విషయాలను దృష్టియందుంచుకొని కూర్చిన వ్యాసమిది. మా సాయిప్రసాద్‌గారు ఒక పర్యాయం ఒంగోలుకు ప్రక్కనున్న గ్రామం పల్లామిల్లిలో..

సర్వసాధారణంగా భగవన్నామాన్నందరు మననం చేయటమన్నది పరిపాటి. ఇహలోక సుఖాలననుభవించటం కోసం కావచ్చు, ధనాపేక్షకావచ్చు, విద్యాభివృద్ధి కావచ్చు, వ్యాపారాభివృద్ధి కావచ్చు, రోగ నివారణము కావచ్చు. ఇలా అని ఒక్కదాన్నే చెప్పలేంగదా! ఎన్నో కారణాలుండవచ్చును. ఇహలోక కామ్యాలను ఆశించే వారి కంటే భిన్నంగా ఉంటుంది మహనీయుల మార్గం. వారు భగవన్నామాన్ని మననం చేయటంలో ముక్తి, మోక్షాలు కావచ్చు, ఆత్మానుభూతులు కావచ్చు, మానసిక వికాసము ఇత్యాదులు కావచ్చు. భగవన్నామాన్ని నిరంతరం మననం చేసుకోవటంలోని ఆంతర్యాన్ని అందరూ అర్ధం చేసుకోలేరు. ఈ విషయాన్ని నిరూపించే ఆఖ్యానమును అవధరించుదాం.

నామజపము వలన దుఃఖము నశించి సుఖము లభించుచునన్నది - వినుసరికి నారదు డంతటివానికి అనుమానమంకురించి తన గురుదేవుని సంశయనివృత్తి చేయమనినారట. అంతట ఆ గురుదేవుడు, నారదా! నీవీ విషయాన్ని తెలుసుకోదలంచితే తక్షణమే భూలోకానికి తరలివెళ్లు. అక్కడ కేతకీవనమునందలి పంకకూపములోని **'క్రిమిని'** ఈ ప్రశ్ననడుగు. అదినీకు తప్పక సమాధానపరుస్తుందని చెప్పారు. నారదుడు వెనువెంటనే భూలోకానికి తరలి అక్కడి బురదగుంటలో పడి ఉన్న క్రిమిని సమీపించి నామజపము యొక్క మహిమను వివరించమని కోరినాడు. వెంటనే ఆ క్రిమి మహాశయా తాము నామజపమహిమను తెలిసికొన కోరినట్లైతే కొద్దికాలము తరువాత ఈ





కేతకీ వనములోని దక్షిణభాగాన గల మేడివృక్షానికి వ్రేలాడే 'కీటకాన్ని' అడిగి వివరాలు తెలుసుకోగలరని నారదమహర్షి చూస్తుండగానే తన్నుకొని మరణించింది. నారదుడాక్రిమి చెప్పిన రీతిగానే కీటకాన్ని సమీపించి నామజపము యొక్క మహిమను వివరించమని కోరాడు. మహాత్మా! తాము సద్గురుని నామమహిమ తెలుసుకొనదలిచినవారైతే అదిగో, కొంతకాలమాగి తూర్పుభాగాన గల వికసించిన ఆమ్రవృక్షముపై నివాసముండే **"చిలుక"**ను అడగగలరని చెప్పి విలవిలలాడుతూ మరణించింది.

కొద్దికాలమాగి నారదమహర్షి చిలకను సమీపించి గురునామమహిమను తెలియజేయ వలసినదిగా కోరినాడు. వెంటనే మహానుభావా! తాము సద్గురుని నామమహిమను వినకోరినట్లైతే హిమవతి గ్రామములోని సుమిత్రుడను వాని యింటిలో కొంతకాలమైన తరువాత 'సుబల' యను పేరుగల గోవు తెల్లనిదూడకు జన్మనివ్వనున్నది దయచేసి మీరీవిషయాన్ని ఆ దూడనడిగి తెలిసికొనగలరని చెప్పి చిలుకకూడా వెంటనే కన్ను మూసింది.

ఈ వింత చర్యలకు నారదమహర్షిలో ఆశ్చర్యము, ఆనందము, పట్టుదలలు హెచ్చినవి. కుతూహలమన్నది అతిశయించినది. సడలని దీక్షతో నిలకడగల మనస్సుతో హిమవతి నగరంవైపుకు కొంతకాలమైన తరువాత సుబలయను గోవును సమీపించేసరికి క్రితంరోజే అది తెల్లని దూడకు జన్మనిచ్చిందని తెలిసికొని దూడనుద్దేశించి గురునామమహిమను వివరించగలవని అడిగాడు. వెంటనే ఆ తెల్లని దూడ జ్ఞానరూపా! నారాయణ నామప్రీతితత్పరా! తాము నిజముగా గురునామ జపమహిమను సదా తెలిసికొనగోరి ఉవ్విళ్లూరుతున్న వారైతే అతి త్వరలో మహిమంతమనుపేరుగల రాష్ట్రమునేలు రాజైన విశ్వరూపునకు కొద్దికాలము తరువాత సంతానోత్పత్తి కాగలదు. ఆ బిడ్డ మిమ్ము సమాధానపర్చగలదని చెప్పి గోవు కూడా పూర్వపువాటి వలె అదే మార్గములో ప్రయాణం సాగించింది. రాజుకు కుమారుడు జన్మించినాడని తెలసి నారదమహర్షి మహిమంత పట్టణానికేగి ఆ బిడ్డతో గురునామమహిమను వివరించమని కోరినారు. అందులకా బిడ్డ కిలకిల నవ్వి అజ్ఞానమును తొలగించు విశారదా నారదా! తమకింకా అంతు చిక్కలేదా? సంశయము నశించలేదా! సమస్తము ప్రత్యక్ష సాక్షివై చూచి తాము ఇంకను గమనించలేక పోయినారా! ఆశ్చర్యమగుచున్నదినాకు. **"జంతూనాంనరజన్మదుర్లభ"** మను మహనీయోక్తి తామెరిగినదే. ఇంత తెలిసి యుండి, ఇంకాననేల గురునామమహిమను గూర్చి అడుగుచున్నారు.

మానవునిగా జన్మించటమంటె సామాన్య విషయంకాదు. క్రమసిద్ధాంత పరిణామంలో జీవులు క్రమక్రమంగా వేలాది సంవత్సరాలుగా రకరకాలైన జన్మలను అనుభవించిగాని మానవ జన్మ ఎత్తలేరను విషయాన్ని తాము స్వయంగా చూచారు. అందుకు నేనే ఉదాహరణ. ఒకవేళ జన్మించినా మానవునిగా హీనాతి హీనమైన నరజన్మ ఎత్తవలసి ఉండవచ్చు. సమస్తఐశ్వర్యాలతో, సర్వసుఖాలతో, ఆయురారోగ్యాలతో జన్మించగలడను నిర్ధారణ లేదుగదా!

తాము నావద్దకు తొలిసారిగా 'క్రిమి' రూపములో ఉండగా వచ్చినారు. నామజపమహిమను అడిగినారు. వెంటనే నాకా జన్మ నుంచి విముక్తి కల్గి 'కీటక' జన్మలోకి వెళ్లినాను మరల తాము గురునామజపమహిమనడిగినారు, 'చిలుక' రూపముదాకా ఎదిగినాను. మీరు అడిగిన ప్రతిసారి నా జన్మరూపాంతరము చెందినదిగదా! చివరకు రాజ్యాధినేతకు తనయుడనైతిని. సర్వభోగాలకు ఆలవాలమైన రాజకుమారుడనైతిని. **"గురునామస్మరణము విన్నంత మాత్రానే ఉత్తమజన్మను పొంది యుండటమేకాకుండా పూర్వజన్మానుభవాన్ని పొందియున్నాను."** ఈ జన్మలో గురునామమహిమను అవగాహన చేసికొనినందున, భ్రమలకు లోనుకాకుండా, మాయలో పడకుండా? ఏదైతే పొందాలో - దానిని పొంది, ఏదైతే మనకు అవసరమో - ఆ అవసరమే తీరి? మనకు ఏదైతే కావాలో - అది లభ్యమయ్యేలా! చేస్తుంది సద్గురుని నామజపమహిమ. "నా భక్తుడు అడిగినవన్నీ ఇస్తాను. నేను ఇవ్వదలచింది అతడు అడిగేంతవరకు" అని బాబా అన్నారు. **"గురునామ ముచ్చరించనిదే గమ్యం దొరకదని"** "భక్తిభరిణె" అను పేరుగల అనువాద గ్రంధము తెల్పియున్నది.

అజ్ఞాన మూలహరణం జన్మకర్మనివారణం
జ్ఞాన వైరాగ్య సిద్ధ్యర్థం సద్గురోః పాదోదకంపిబేత్॥

"అజ్ఞానమునకు మూలమైనదానిని హరింపచేసి, జన్మకర్మలను నివారించి, జ్ఞాన, వైరాగ్యములను పొందుటకై సద్గురుని పాదోదకమును తాగుతానని" గురుగీతలో ఉంది. ఇలా ఉదాహరిస్తే ఎన్నో...

**గురుబంధువులారా! గురుకృప పాత్రులారా!**

కాలమనంతమైంది - అదిసాగిపోతుంది, కదిలిపోతున్నది. క్షణాలనుంచి నిముషాలదాకా! నిముషాల నుంచి గంటల దాకా, గంటల నుంచి రోజుల దాకా! రోజుల నుంచి మాసాల దాకా! మాసాలు వత్సరాల దాకా సాగిపోతుసాగిపోతు అవన్నీ ఒకే ఒక ముహూర్తకాలాన మృత్యుదేవతవైపుకు తరలింపచేస్తున్నాయి. తస్మాత్ జాగ్రత్త! యోచించు - ఆలోచించు - అవలోకించి - ఉత్తమ మార్గమైనదేదో దానివైపుకు పరుగులుతీయి. శుభాధిక్యతనిచ్చు దానివైపుకు మొగ్గుచూపు. "గురువచనాన్ని వినుము - ఆచరించుము." బాబా సన్నిధికి దరిచేర్చగల సత్సంగాలకు వెళ్లుము. ప్రలోభాలను పెంచుతావులకు మనమేలచేరవలె - యోచించు. గురువచనాన్ని విని! ఆచరించిన నాడే గురుపూర్ణిమ! నిరంతరము అమోఘమైన ఆ వచనము, ఆ వచనము వెనుక గల ఆంతర్యమును అర్థముచేసుకొనుటయు గురుపూర్ణిమే. "గురునామ జపానికున్న" మహిమ అంతింతని అంతంతని చెప్పనలవికానిది. ఔచ్ఛాహియైన గురుభక్తుడొకడు ఇలా అన్నాడు.

"గురు దేవుని స్మరియించిన జన్మధన్యము
గురునామము జపియించిన ముక్తి దాయకం"





గురుచరణమే శరణమనుము　　గురుసేవ చేయుము - గురుపాద మొత్తుము
అంతకన్న ఆనందమే లేదనము　　గురుబాటలో నడువుము - గురువచనమినుము
గురుకరములకు శిరము వంచుము　　గురుని గాంచుటే నయనాలకు ఫలము
నిన్ను నడిపించుదైవ మతడేననుము　　ఆ స్వామిరాకకై వేచిఉండుటే నయము"

ఒక కబీరులా, తుకారామునిలా తంబూర మీటుకుంటూ పాడుకుంటూ, గురునామస్మరణ చేసుకుంటూ గురుపూర్ణిమను తనివితీరా అనుభవించుదాం.

సమర్పణ : డా॥ ఎస్. సాయివరప్రసాదరావు, లీడర్, రేపల్లె

## మహనీయుల మహితోక్తులు

## *మానవునిది మమకారం - మహాత్మునిది ప్రేమ*

బాబాచరిత్ర చదివేవారికి రఘువీరపురందరే భోజనము చేయలేదని బాబా ఎంతగానో విలవిలలాడి పోయిన సంఘటన గుర్తుండి ఉంటుంది. సజల జల నేత్రులైనవారు గూడా కొందరున్నారు. ఒక మహాత్మునిలో ఇంతటి ఎదురు తెన్నులు చూచే సందర్భముంటుందా అని - అనుకొనే వాడిని. విలవిలలాడటమన్నది సంభవమా? అన్న భావన కూడా ఉంది. అయితే ఈ భావాన్ని నేను ఎవరితోను పంచుకోలేదు. మాటవరసకు కూడా అనలేదు.

ఒకసారి కొండయ్యగారి కుమారునికి "సుస్తీ" చేసింది. మొదట ఆయన ప్రయత్నాలు ఆయన చేసికొని చివరకు విషయాన్ని గురువుగార్కి చెప్పారు. అప్పుడు కొండయ్యగారు నెల్లూరులో ఉన్నారు. గురువుగార్కి విషయం చెప్పిన వెంటనే కొండయ్యగార్ని బయలుదేరి రమ్మన్నారు మందివ్వటానికి, సహజంగానే కొండయ్యగారు ఓ మాదిరి బద్ధకస్తులు. (మందుకు పంపితే.... దేనికోసమో వచ్చాడన్న సామెతలా ఉంటుంది.) గురువుగారప్పుడు ఒంగోలులో ఉన్నారు. కొండయ్య బస్సుకు బయల్దేరాడో! రైలుకు వస్తున్నాడో తెలియదు, కాని గురువుగారిలో ఓ విధమైన ఆందోళన చెలరేగింది. నేను సామాన్య మావవుణ్ణి కాబట్టి ఆ తీవ్రతను అర్థం చేసికోలేక ఆందోళన అని వ్రాసినాను. కొంతకాలమైన తరువాత తెలుసుకోగల్గినాను. **అది ఆందోళనకాదని మహనీయునిలోని "ప్రభంజన సదృశ్యజనితమైన ప్రేమని".** అది సహజంగా ఉద్భవించేదని తెలుసుకోవటానికి చాలా కాలంపట్టింది. కొండయ్యగారి కోసం ఎంతగా ఎదురు తెన్నులు చూసారో! ఎన్నిసార్లు అనుకొన్నారో! ఎంతగా విలపించారో! అప్పుడేమీ అనిపించలేదు. ఒక సామాన్యమానవునిలానే అనిపించింది. మందివ్వాలని వారు ఎంతగా ఆరాటం చెందారో ఇప్పుడు నెమరు వేసుకుంటే తెలిసింది. అప్పుడది సామాన్యంగా అన్పించినా ఇప్పుడది అసామాన్యం. అసదృశ్యం అనిపించక మానదు.







కొండయ్యగారు రానందుకు, పిల్లవానికి (నవీన్) ఎలా ఉందో! కనీసం ఫోను ద్వారానైనా తెలియజేయనందుకు విసుగు అందామా! అంటే అప్పడైతే అనేవాడిని, ఆరాటమందామా! అంటే మహాత్మునికి ఆరాటమేమిటనిపిస్తుంది. అప్పటి స్థితి చూచేసరికి ఇప్పటి ఆలోచనలతో సరిపోల్చుకుంటే నాకు గురువుగారిలో గొడగూచి కన్పించారు. ఎన్నిసార్లు మననం చేసారో! నవీన్ విషయం తెలుసుకోవటానికి ఒక గంట కాలవ్యవధిలో 20 సార్లైనా అనుకొని ఉంటారు. తల్లికి లేని బాధ మంత్రసానికి వచ్చిందన్నట్లు, కందకులేని దురద కత్తిపీటకొచ్చిందన్నట్లుంది. తండ్రికి లేని ఆందోళన ఆయనలో చూడగల్గినాను. ఆశ్చర్యపోయాను.

**"మానవునిది మమకారం - మహాత్మునిది ప్రేమ"** గురువుగారు ప్రేమించడం ప్రారంభిస్తే వ్యక్తి యొక్క సర్వస్వాన్ని (ఆపాదమస్తకాన్ని) ప్రేమిస్తారు. అతనికి సంబంధించిన అన్ని విషయాలు వారివిగా భావిస్తారు. ఆపాదమస్తకాన్ని వారి అధీనంలో ఉంచుకుంటారు. వారి పూర్తి బాధ్యతను నెత్తిన పెట్టుకొని సంతోషంగా మోస్తారు. ఆనాటి ఆ సన్నివేశానికి తగినట్లుగా వ్రాయలేక పోయినందుకు, భావవ్యక్తీకరణ చేయలేకపోతున్నందుకు నా దైవం నన్ను క్షమించాలి.

**"లేదు లేదు నీ కరుణకు పోలిక"** అన్న వాక్యం ఎంత నిజమో! బాబా విలవిలలాడడము - గురువుగారిలోను కనిపించటము చూడగల్గినాను. ఇది ఒక్క కొండయ్య కుమారుని విషయంలోనే కాదు వారి దరికి చేరిన ప్రతి జీవి విషయంలోను ఇంతే.

- గురుచరణదాసుడు

**గురుబంధువులు తమ అనుభవాల్ని Internet ద్వారా పంపడానికి**
**leelas@guruji.org కి mail చేయగలరు.**

**మీ అనుభవాలు, పత్రికకు మీరిచ్చే సలహాలను సాదరంగా ఆహ్వానిస్తుంది "గురుకృప". మీ వ్యాసాలను, అనుభవాలను 15వ తేదీ సెప్టెంబర్, 2003 లోపు క్రింది చిరునామాకు పంపిన విజయదశమి సంచికకు స్వీకరింపబడతాయి. తరువాత వచ్చే వాటిని జన్మదిన సంచికకు స్వీకరించబడతాయి.**

**'గురుకృప' - 22-1-50, జి.వి.కాంప్లెక్స్, గాంధీచౌక్, తెనాలి - 522 201**
**'గురుకృప'- సాయివరప్రాసాదం, సత్యనారాయణ వీధి, రామలింగేశ్వర పేట, తెనాలి - 522 201**

**ఇంటర్ నెట్‌లో "గురుకృప" - Visit : www.guruji.org**